

ఐదుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

ఐదుగురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. 62 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.
-10లో..



వేర్వేరు ప్రమాదాలలో ఏడుగురికి గాయాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. వారిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.
-10లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.100	రూ.158

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1445 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	290	438
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 690.70 కిలోలు

న్యూస్‌రీల్

రైలు ప్రమాద బాధితుల కోసం కంట్రోల్ రూం



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఒడిశా రాష్ట్రంలో బాలాసుర్ జిల్లాకు సమీపంలో జరిగిన హౌరా చెన్నై కోరమాండల్ ఎక్స్‌ప్రెస్(12841) రైలు ప్రమాద ఘటనపై జిల్లాకు సంబంధించి ఏదేని సమాచారం అందజేయడానికి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఈ దుర్ఘటనపై సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి ఎవరైనా ఈ ప్రమాదంలో ఉంటే తక్షణమే కుటుంబసభ్యులు సంప్రదించాలన్నారు. అందులో భాగంగా అన్నమయ్య జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, అన్ని శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు తరచూ మాట్లాడుతున్నామన్నారు. ఎవరైనా ఈ జిల్లాలో ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 08561-293066 నెంబర్‌కు కాల్ చేస్తే అధికార యంత్రాంగం సహాయంగా ఉంటారన్నారు.

9న మెగా జాబ్ మేళా

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మదనపల్లి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌తో కలిసి జనరల్ మేనేజర్ గోపినాథ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణలు మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న మేళాలో బహుళజాతీయ కంపెనీలు బిజినెస్ కనెక్ట్, కియా మోటార్స్, హెటిరో డ్రగ్స్, కోజెంట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, గ్రీన్ టెక్ టీసీఎల్, డిక్సన్ తదితర 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ, ఎంబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 8897776368, 7799587687 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తూర్పు దిశగా శ్రీవారి పాదాల ప్రతిష్ట



తిరుమలకొండ ఎత్తు వద్ద పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో తిరుమల కొండ ఎత్తు వద్ద నిర్మించ తలపెట్టిన శ్రీవారి పాదాల స్థలాన్ని సిద్ధం చేసిన మ్యాపును ఆర్డీఓ, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ ఎం.ఎస్.మురళి శనివారం పరిశీలించారు. నిర్మాణం, వాస్తు పద్ధతిపై స్థపతి గోవిందరావు పరిశీలించి వివరించారు. శ్రీవారి పాదాలు తూర్పుదిశగా ప్రతిష్ఠించి, దాని పక్కనే గరుత్మంతుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే సరిపోతుందంటూ పలు సూచనలు చేశారు. కాగా, ఆర్డీఓ హార్సిలీహిల్స్‌పై ఏనుగుమల్లమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. కొండపై చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించారు. పర్యాటక శాఖ మేనేజర్ నేదురుమల్లి సాల్వీన్‌రెడ్డి, తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, హార్సిలీహిల్స్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విషాదయాత్ర

- రోడ్డు ప్రమాద మృతులంతా అపార్టుమెంట్ స్నేహితులే
- ప్రమాదంలో సెబ్ సీఐ నాగమణితో పాటు మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు



లారీని ఢీకొన్న తుఫాన్ వాహనం

నంద్యాల: వారంతా ఎక్కడెక్కడి నుంచో కొన్నేళ్ల క్రితం ఉద్యోగ, వ్యాపారాల కోసం నంద్యాలకు చేరుకున్నారు. అపార్ట్‌మెంట్ వేదికగా వారి మధ్య స్నేహబంధం ఏర్పడింది. పండుగలు, వేడుకలు సంతోషంగా నిర్వహించుకునేవారు. అప్పుడప్పుడూ విహార, తీర్థయాత్రలకు వెళ్లేవారు. ఈసారి అలా వెళ్లిన వారిలో నలుగురు తిరిగి రాలేదు. మృత్యువు పొట్టన పెట్టుకుంది. వారి తీర్థయాత్ర విషాద యాత్రగా మిగిలింది. అరుణాచలం దైవదర్శనానికి వెళుతూ అన్నమయ్య జిల్లా పీలేరు సమీపంలో రోడ్డు ప్రమాదంలో జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన శివమ్మ(44), ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన విమలమ్మ(45), లక్ష్మీదేవి(55), నర్స్ క్వార్టర్స్‌కు చెందిన ప్రతాపరెడ్డి(43) మృతి చెందారు. సెబ్ సీఐ నాగమణితో పాటు మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఉద్యోగ, వ్యాపార రీత్యా వచ్చి..

మృతులంతా ఉద్యోగ, వ్యాపార రీత్యా కొన్నేళ్ల క్రితం నంద్యాలకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఎన్‌జీఓ కాలనీలో ఉన్న సింఫని అపార్టుమెంట్‌లో ప్రస్తుతం సెబ్ సీఐగా పని చేస్తున్న నాగమణి, విమలమ్మ, లక్ష్మీదేవి, శివమ్మ నివాసం ఉండేవారు. ఈ స్నేహం వీరు ఇల్లు మారినా కొనసాగింది. ఏ శుభకార్యం జరిగినా, తీర్థయాత్రలకు వెళ్లాలన్నా వీరంతా కలిసి వెళ్లేవారు. మహిళలందరూ గృహిణులే. భర్తలు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసేవారు. మృతురాలు శివమ్మ గృహిణి కాగా భర్త శివస్వాములు శిరివెళ్ల పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. వీరు ప్రస్తుతం ఎస్‌బీఐ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలు విమల గృహిణి కాగా, భర్త నాగన్న నంద్యాలలో విద్యుత్ కార్యాలయంలో ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. వీరికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతురాలు లక్ష్మీదేవి గృహిణి కాగా భర్త రామ్మోహన్ వ్యాపారం చేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు ప్రతాపరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా భార్య స్వాతి గృహిణి. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రజలు ప్రమాద విషయం తెలుసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. కొన్ని సంవత్సరాల పాటు ఇక్కడే అందరితో కలివిడిగా తిరిగిన మనుషులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ ప్రాంత వాసులు జీర్ణించుకోలేకపోయారు.



పీలేరు ఆస్పత్రి వద్ద మృతదేహాలు



మృతుల బంధువులను పరామర్శిస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పెళ్లి బస్సుకు తప్పిన పెను ప్రమాదం



మలుపులో ఆగిపోయిన పెళ్లిబస్సు

బి.కొత్తకోట : రాజమండ్రి నుంచి అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వస్తున్న పెళ్లి బస్సు పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. శనివారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలు..హార్సిలీహిల్స్‌పై గవర్నర్‌బంగ్లా, స్విమ్మింగ్ పూల్ ఎదుట ఖాళీ స్థలంలో ఓ ఉన్నతాధికారి వివాహ వేడుకకు ఏర్పాట్లు చేశారు. ఈ పెళ్లికి హాజరయ్యేందుకు రాజమండ్రి నుంచి 40 మంది ప్రయివేటు బస్సులో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరారు. బస్సు శనివారం ఉదయం 10 గంటల సమయంలో కొండ ముఖద్వారానికి చేరుకుని ఘాట్‌రోడ్డులో ప్రయాణం మొదలైంది. రెండు మలుపులు దాటుకుని అత్యంత ప్రమాదకరమైన మూడో మలుపు ఎక్కుతోంది. (దీన్ని ప్రొద్దుటూరు మలుపు అంటారు, ఇక్కడ 40 ఏళ్ల క్రితం ప్రొద్దుటూరుకు చెందిన పెళ్లి బస్సు ప్రమాదానికి గురై అందరూ మృత్యువాత పడ్డారు.) ఇది చాలా ఇరుకుగా, ఎత్తుగా ఉండే మలుపు కావడంతో బస్సులు, మినిలారీలు, లారీలు ఈ మలుపు దాటుకుని వెళ్లడం కష్టంతో కూడింది. సరిగ్గా మలుపు మధ్యలో పెళ్లి బస్సు జాయింట్ రాడ్ విరిగి పోయి ముందుకు కదల్లేదు. ఎత్తులో ఉన్న బస్సు వెనక్కు కిందకు జారి మలుపువద్ద నిర్మించిన ఇనుప కంచెను ఢీకొనాల్సింది. అయితే డ్రైవర్ చాకచక్యంతో ఆగిన బస్సు అక్కడే నిలిచేలా ప్రయత్నించి చక్రాల కింద రాళ్లు పెట్టాడు. లేదంటే బస్సు వెనక్కు వచ్చి ప్రమాదానికి గురయ్యేది. ఇనుప కంచెను ఢీకొని అక్కడితో ఆగడమో లేక ఇంకేమైనా జరిగేది. ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకపోవడంతో బస్సులోని వారిని వాహనాల్లో కొండపైకి వెళ్లారు. ఎస్‌ఐ రామమోహన్ తన సిబ్బందితో వెళ్లి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రెండు నిమిషాల్లో ఇంటికి చేరేలోపే ఘోరం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత
- మిన్నంటిన బంధువుల, కుటుంబికుల రోదనలు

పీలేరు : మదనపల్లె నుంచి పీలేరుకు 50 కిలోమీటర్లపైగా క్షేమంగా పయనించి... రెండు నిమిషాలు ఆగితే ఇంటికి చేరుతారనగా.. ఇంతలోనే కర్ణాటక ఆర్టీసీ బస్సు రూపంలో ఆ ఇద్దరినీ మృత్యువు కబళించింది. పీలేరు పట్టణం కొండారెడ్డిసర్కిల్ వద్ద టాటాఏఎస్ – కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇర్షాద్, విజయకుమార్ అనే ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు.

- పీలేరు పట్టణంలోని సరోజినీదేవి వీధికి చెందిన ఇర్షాద్ (27)కు భార్య రోషిణి తోపాటు కుమారుడు అమాన్, కుమార్తె ఫిదా ఉన్నారు. టాటాఏస్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న ఇర్షాద్ ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. రోషిణిని ఓదార్చడం ఎవరితరం కాలేదు.
- పీలేరు పట్టణం ఇందిరమ్మకాలనీకి చెందిన విజయకుమార్ (50) టాటాఏస్‌కు కూలీగా వెళుతూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు భార్య చిట్టెమ్మ, కుమారుడు శివనాగరాజు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న విజయకుమార్ ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



ఆస్పత్రి వద్ద విలపిస్తున్న ఇర్షాద్ భార్య రోషిణి



విజయకుమార్ భార్య చిట్టెమ్మ



బస్సును ఢీకొన్న టాటా ఏస్ వాహనం

ఆలయ భూముల సంరక్షణకు శ్రీకారం

గ్రామాల వారీగా వివరాలు నమోదు

మదనపల్లె సిటీ: దేవాలయాల భూములు, ఇతర ఆస్తుల సంరక్షణకు అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే జిల్లాలోని దేవదాయశాఖ అధికారులు వివరాలను పక్కాగా (43 రిజిస్టర్) ప్రాపర్టీ రిజిస్టర్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ వివరాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపి ఆ భూముల క్రయ విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. భవిష్యత్తులో ఆలయ భూములు ఎవరు ఆక్రమించినా ఈ రికార్డుల ఆధారంగా కోర్టుల ద్వారా భూములను సంరక్షించుకోవచ్చు. జిల్లాలో 1316 దేవాలయాలకు సంబంధించి 8281.54 ఎకరాలు ఆస్తులు ఉండగా అందులో 2112.35 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి.

గ్రామాల వారీగా..

గ్రామాల వారీగా దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయ భూములు, ధర్మకర్తలు, పూజారుల ఆధీనంలో ఉన్న భూములను గుర్తించి పక్కాగా నమోదు చేస్తున్నారు. ఈఓలు, ఆలయ సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఆలయాలు, భూముల ఫోటోలు తీసి గూగుల్ యాప్ ద్వారా జియో ట్యాగింగ్ చేసి రికార్డులు తయారు చేస్తున్నారు. ఏ భూములు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో గుర్తిస్తున్నారు.

- పట్టణాల్లో ఆలయాల పేరిట ఉన్న వ్యాపార దుకాణాలు, మండపాలు, సత్రాలు, మఠాలు, దేవతల నగలు, ఖాళీ స్థలాలు తదితర వివరాలను కూడా నమోదు చేస్తున్నారు.

మొన్నటి దాకా గ్రామాల్లో ఏ ఆలయ భూమి ఎక్కడ ఉందో ఎవరి స్వాధీనంలో ఉందో తెలిసేది కాదు. పలు చోట్ల భూములు అన్యాక్రాంతమయ్యాయి. పలుకుడి ఉన్న వారు, భూస్వాములు దర్జాగా ఆక్రమించి మాగాణి భూముల్లో రెండు, మూడు పంటలు సాగు చేస్తున్నా అడిగే వారే లేరు. వీటన్నింటికి త్వరలో చెక్ పడనుంది.

డివిజన్లలో సమీక్షా సమావేశాలు..

ప్రాపర్టీ రిజిస్టర్ తయారు చేసే విధానంపై డివిజన్ల వారీగా దేవాదాయశాఖ అధికారులు సమీక్షలు నిర్వహించారు. ఆయా మండలాల ఈఓలు, సిబ్బంది, పూజారులతో సమీక్షలు నిర్వహించారు.



మదనపల్లెలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవాలయం

మండలం	ఆలయాల సంఖ్య	ఆలయ భూములు (ఎకరాల్లో)
రాజంపేట	89	252.61
పుల్లంపేట	53	147.40
రైల్వేకోడూరు	43	537.74
ఓబులవారిపల్లె	34	130.50
చిట్వేలి	25	148.72
నందలూరు	37	49.34
పెనగలూరు	74	218.33
చిన్నమండ్యం	45	335.94
సంబేపల్లి	32	253.19
రామాపురం	28	295.88
లక్కిరెడ్డిపల్లె	28	219.05
గాలివీడు	77	598.63
వీరబల్లి	36	172.02
రాయచోటి	52	195.98
టి.సుండుపల్లి	48	227.33
బి.కొత్తకోట	54	348.34
కె.వి.పల్లి	32	198.80
పీలేరు	58	222.10
పీటీఎం	62	385.03
పెద్దమండ్యం	32	372.07
కురబలకోట	16	381.04
కలకడ	26	135.07
వాల్మీకిపురం	43	140.06
మదనపల్లె	27	184.11
నిమ్మనపల్లె	13	119.10
ములకలచెరువు	28	320.10
రామసముద్రం	77	598.00
తంబళ్లపల్లె	82	451.00
కలికిరి	27	307.70
గుర్రంకొండ	38	334.20

పకడ్బందీగా వివరాల సేకరణ

జిల్లాలోని ఆలయ భూములు, ఆస్తుల సంరక్షణకు రెవిన్యూ అధికారుల సహకారంతో వివరాలను పకడ్బందీగా సేకరించి రికార్డులు తయారు చేస్తున్నాం. భవిష్యత్తులో ఈ రికార్డులు ఎంతగానో ఉపయోగపడతాయి. అన్యాక్రాంతమైన భూములు, ఆస్తుల వివరాలు కూడా తెలుస్తాయి. అర్చకుల వివరాలు సైతం నమోదు చేస్తున్నాం. అందుకు ధర్మకర్తలు, పూజారులు, ప్రజలు సహకరించాలి.
–విశ్వనాథ్, జిల్లా దేవాదాయశాఖ అధికారి, రాయచోటి



సైనికుల్లా పనిచేయాలి



కురబలకోట సభలో మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

కురబలకోట: టీడీపీ అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడానికి మరో సారి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులు సైనికుల్లా పనిచేయాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యుల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డితో కలసి ఎంపీ మిథున్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ రోజుల్లో సోషల్ మీడియా ప్రజా జీవితంలో అంతర్భాగంగానే కాకుండా పత్రికలకు తీసిపోని విధంగా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తోందన్నారు. మహత్తర శక్తిగా సోషల్ మీడియా ఎదుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీకి నాయకులు, కార్యకర్తలతో పాటు సోషల్ మీడియా కూడా బలంగా మారిందన్నారు. రాజకీయాల్లో కూడా ప్రధాన భూమికను పోషిస్తోందన్నారు. సోషల్ మీడియా వేగంగా ప్రభావాన్ని చూపుతోందన్నారు. అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాకు రూ. 17 లక్షల విరాళం ప్రకటించారు. తంబళ్లపల్లె నియోజక వర్గం గురించి ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా పేరొందిన తంబళ్లపల్లె నేడు అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. త్వరలో వేయనున్న 90 రోడ్లతో కలిపి వెయ్యి కిలోమీటర్ల మేర కొత్త రోడ్లు వేసినట్లు అవుతుందన్నారు. తంబళ్లపల్లెలో టీడీపీ నిర్వాకంతో కుట్ర పూరితంగా ఆగిన ముదివేడు ఇతర రిజర్వాయర్ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. తంబళ్లపల్లెలో అశించిన నీటి వసతి లేదన్న ఏకైక కారణం చేత పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపడం లేదన్నారు. ఇలాంటి వాటిని దృష్టిలో ఉంచుకునే ముదివేడు రిజర్వాయర్, పైపులైన్ ద్వారా తాగునీరు, హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇవన్నీ పూర్తయితే సీఎం జగన్ ఆశీస్సులతో త్వరలో తంబళ్లపల్లె నియోజక వర్గానికి పరిశ్రమలను తెప్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎం జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించి చరిత్ర తిరగరాయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకులు ఇరగమ్ సుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లా గ్రానైట్స్ అసోసియేషన్ అధ్యక్షులు వరదారెడ్డిగారి నారదరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా నాయకులు, టీమ్ ద్వారకనాథరెడ్డి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఇండక్షన్ ట్రైనింగ్

రాయచోటి అర్బన్ : ఈ నెల 5 నుంచి 9 వరకు ఉమ్మడి కడప–చిత్తూరు–అనంతపురం జిల్లాల్లోని డీఎస్సీ 2018 ఉర్దూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు డైట్ కళాశాలలో ఇండక్షన్‌ట్రైనింగ్‌ను నిర్వహిస్తున్నట్లు కడప డీఈఓ వై.రాఘవరెడ్డి తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను తీవ్రంగా వేధిస్తున్న భర్తపై టూటౌన్ సీ.ఐ మురళీకృష్ణ, ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. పట్టణంలోని చంద్రకాలనీకి చెందిన గురనాథ్ వేధింపులకు పాల్పడుతున్నట్లు అతని భార్య సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. 2003లో వీరికి వివాహం కాగా, కుమారుడు గురుశాంత్, కుమార్తె జాహ్నవివందనలు ఉన్నారు. ఆరు సంవత్సరాల పాటు వీరి కాపురం సజావుగా సాగింది.తర్వాత భర్త మద్యం అలవాటుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు,పెద్ద మనుషుల మాటలతో కాపురాన్ని కొనసాగించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. తన పేరుపై ఉన్న ఇల్లును ఫోర్జరీ సంతకాలతో భర్త రాసుకున్నాడని, పిల్లలతో పాటు తనను ఇంట్లో నుంచి గెంటివేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ప్రస్తుతం తాము బాడుగ ఇంట్లో తలదాచుకుంటున్నామని, న్యాయం చేయాలని కోరింది.దీంతో గురునాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు... గుర్రంకొండ మండలం ఎగువ అమిలేపల్లికి చెందిన ఎస్.జగదీష్(25) బి.కొత్తకోటకు చెందిన నరేంద్ర(35) ద్విచక్రవాహనంలో మదనపల్లె నుంచి ఎగువఅమిలేపల్లికు వెళుతుండగా మదనపల్లె మండలం ఎనుములవారిపల్లె వద్ద, మరో బైక్ వీరి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో జగదీష్, నరేంద్రలు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చక్రంలో చీర చుట్టుకుని..

పుంగనూరు మండలం ఈడిగపల్లెకు చెందిన రమేష్ బెంగళూరులో కూలి మేస్త్రీగా పని చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం భార్య వనిత (22) అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చారు. చికిత్స అనంతరం ఇద్దరూ ద్విచక్రవాహనంలో బెంగళూరుకు బయలుదేరారు. మదనపల్లె మండలం బొమ్మనచెరువు వద్ద వనిత కట్టుకున్న చీరచెంగు ద్విచక్రవాహనం వెనుక చక్రంలో చుట్టుకుని ఆమె కింద పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.


గాయపడిన గోపాల్, వనిత

ద్విచక్రవాహనం అదుపు తప్పి..

కురబలకోట మండలం కంటేవారిపల్లెకు చెందిన నవీన్‌కుమార్(23) బెంగళూరులో బీబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం బెంగళూరుకు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఏపి-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. గాయపడిన నవీన్‌కుమార్‌ను ఆటోలో స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని..

పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ ఎల్లారుబైలుకు చెందిన లక్ష్మిరెడ్డి(60) వేరుశన విత్తనకాయల కోసం ద్విచక్ర వాహనంలో పెద్దమండ్యం మండలం కలిచెర్లకు బయలుదేరాడు. కురబలకోట మండలం అంగళ్లు వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని కారు ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇన్నోవా ఢీకొని..

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారులు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది.అంగళ్లకు చెందిన ఆర్మీ ఉద్యోగి రాజశేఖర్‌రెడ్డి (43) తన కుమారుడు సాయిచరణ్‌రెడ్డి(20)లతో కలిసితాము నూతనంగా నిర్మిస్తున్న ఇంటొనిర్మాణం వద్దకు వెళ్లారు. తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తుండగా, అంగళ్లు సబ్ స్టేషన్ వద్ద వీరి వాహనాన్ని ఇన్నోవా వాహనం ఢీకొంది. ప్రమాదంలో తండ్రి,కుమారులు రాజశేఖర్‌రెడ్డి, సాయిచరణ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

టెంపో ఢీకొని..

కురబలకోట మండలం కనసానివారిపల్లెకు చెందిన ఎస్.గోపాల్(65) మదనపల్లె పట్టణం జడ్జిబంగ్లా సమీపంలో నివాసం ఉన్నాడు. అంగళ్లు మిట్స్ కాలేజీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు .వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లె నుంచి కనసానివారిపల్లెకు బయలుదేరాడు. మార్గ మధ్యంలోని కురబలకోట మండలం అంగళ్లు ఎస్‌బీఐ వద్ద వేగంగా వచ్చిన టెంపో బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో గోపాల్ గాయపడ్డాడు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ఇద్దరు ఆత్మహత్య

మదనపల్లె : అనారోగ్యం భరించలేక ఇద్దరు ఆత్మహత్యకు పాలపడ్డారు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలు..పీటీఎం మండలం బాగేపల్లెకు చెందిన వెంకటేష్‌రెడ్డి(46) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా కడుపు నొప్పి బారినపడి, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం మరోసారి కడుపునొప్పి తీవ్రతరం కావడంతో భరించలేక పురుగుల మందుతాగాడు. అపస్మారస్థితిలో ఉన్న బాధితుడిని కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య సునీత, కుమార్తె తన్విక(2) ఉన్నారు. పీటీఎం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- సత్యసాయి జిల్లా కదిరి పట్టణం బాబాకాలనీకి చెందిన శ్రీరాములు (35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఉపాధి కోసం కొంత కాలం కిందట బి.కొత్తకోట పట్టణానికి వచ్చాడు. ఇది వరకే అతను అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం మరోసారి అనారోగ్యం బారిన పడటంతో, మనస్థాపం చెందిన శ్రీరాములు మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, ఇద్దరు సంతానం ఉన్నారు. బి.కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

62 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

కడప అర్బన్/రైల్వేకోడూరు : వైఎస్ఆర్ జిల్లాలో సిద్దవటం, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తదితర అటవీప్రాంతాల్లో జరిగిన మూడు సంఘటనల్లో ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, మొత్తం 62 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు ఆధ్వర్యంలో మూడు బృందాలు శుక్రవారం కూంబింగ్ చేపట్టాయి. రైల్వేకోడూరు సబ్‌కంట్రోల్ ఆర్ఐ కృపానంద టీమ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మానికతో కలిసి సిద్దవటం రేంజ్, ముత్తుకూరు అటవీప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. శనివారం ఉదయం 4 గంటల సమయంలో దబ్బకోన ఫారెస్ట్ ఏరియా చేరుకునేసరికి కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా దుంగలను పడేసి చీకట్లో పారిపోయారు. అయితే ఐదురురిని పట్టుకోగలిగారు. పట్టుబడిన వారిలో నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన చిల్పం సాంబయ్య, యడమకంటి రమణయ్య, వైఎస్ఆర్ జిల్లా కుంభగిరికి చెందిన ముద్దా నరసింహులు, ఖాజీపేటకు చెందిన నక్కా వెంకటేష్, బద్వేల్ టౌన్‌కు చెందిన వనం చెన్నయ్య ఉన్నారు. వీరి నుంచి 753 కిలోల బరువున్న 26 ఎర్రచందనం దుంగలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ఆర్ఐ కె. సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ టీమ్ అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు తుమ్మలబైలు సెక్షన్ నుంచి కూంబింగ్ చేపట్టారు. కరకుఏరు ప్రాంతం వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరిని హెచ్చరించి చుట్టుముట్టేలోపు దుంగలను పడేసి పారిపోయారు. ఆ ప్రాంతంలో 8 ఎర్రచందనం దుంగలు లభించాయి. మరో సంఘటనలో ఆర్ఎస్ఐ పి. నరేష్ టీమ్ పోరుమామిళ్ల మండలం, తంబళ్లపల్లి సెక్షన్ నుంచి కూంబింగ్ చేపట్టారు. నాగలకుంట్ల పోస్టు, రామేశ్వరం గ్రామంలో రాచకొండ రామయ్య ఇల్లు గ్రామం చివర ఉండటంతో అనుమానంతో అక్కడికి చేరుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని చూసి రామయ్య అక్కడి నుంచి పారిపోయాడు. ఇంతకుముందు అతను ఫారెస్ట్ వాచర్‌గా పనిచేసేవాడు. ఇంట్లో సోదా చేసి 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 62 ఎర్రచందనం దుంగల విలువ రూ. 60 లక్షలు వరకు వుంటుందనీ అంచనా వేశారు. ఈ మూడు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేశారు. సీఐ బాలకృష్ణ, ఎస్ఐ మోహన్‌నాయక్ విచారిస్తున్నారు. ఈ ఆపరేషన్‌లలో పాల్గొన్న బృందాలకు డీఐజీ సెంథిల్‌కుమార్ రివార్డులు ప్రకటించారు.


నిందితులు, స్వాధీనం చేసుకున్న దుంగలతో డీఎస్పీలు చెంచుబాబు, మురళీధర్

కిడ్నాప్ చేసి మట్టుబెట్టారు

మృతదేహాన్ని గుర్తించిన బంధువులు

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె : ఆర్థిక లావాదేవీలే అతని దారుణ హత్యకు దారి తీశాయి. తన స్నేహితుడికి డబ్బులను పూచీ పడిన పాపానికి అతన్ని పిలిచి దారుణంగా కొట్టి, చంపి తమపైకి రాకుండా ఉండేందుకు చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలోకి తీసుకుని వెళ్లారు. మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించి తగులబెట్టారు. ఈ సంఘటనలో మృతుడి శరీరంపై వున్న దుస్తులు, చేతికున్న పచ్చబొట్టు 'కె.సుహాసిని' అనే గుర్తు ఉండటంతో అతని బంధువులు శ్రీకాంత్ రెడ్డి(39)గా గుర్తించారు.


శ్రీకాంత్ రెడ్డి (ఫైల్)

దీంతో శ్రీకాంత్ రెడ్డి హత్యకు గురయ్యాడని ప్రాథమికంగా తెలుసుకుని పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ సంఘటనపై విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. కడప నగర శివార్లలోని ఊటుకూరుకు చెందిన శ్రీకాంత్ రెడ్డి (39) అక్కాయపల్లిలో టీ దుకాణం పెట్టుకుని జీవించేవాడు. నష్టం రావడంతో ఆ వ్యాపారాన్ని చాలించాడు. ఈక్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తాను మొదట 'కె.సుహాసిని' అనే మహిళను ప్రేమించి వివాహం చేసుకోవాలనుకున్నాడు. అతని చేతికి ప చ్చబొట్టు కూడా పొడిపించుకున్నాడు.ఈ పచ్చబొట్టే అతన్ని గుర్తించేలా ఉపయోగపడింది. తరువాత మరో మహిళను వివాహం చేసుకున్నాడు. వారి మధ్యన మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఇదిలా వుండగా శ్రీకాంత్ రెడ్డి, దేవునికడపకు చెందిన తన స్నేహితుడు సత్యంకు ముత్తరాసపల్లెకు చెందిన 'లేడీ డాన్'గా పిలువబడే ఓ మహిళ నుంచి రూ. 8 లక్షలు, సత్యం పనిచేసే యజమాని దగ్గర కొన్ని లక్షల రూపాయలను అప్పుగా ఇప్పించాడు. ఈ మొత్తాలకు మృతుడు శ్రీకాంత్‌రెడ్డే పూచీగా ఉన్నాడు. సత్యం డబ్బులను కట్టలేదని, ఈనెల 1వ తేదీన లేడీడాన్, మరో వ్యక్తి తమ మనుషులతో శ్రీకాంత్‌రెడ్డిని తమ ప్రదేశంలోకి పిలిపించారు. శ్రీకాంత్‌రెడ్డిని కొట్టి హింసించారు. ఈక్రమంలోనే అతను ప్రాణాలు కోల్పోయాడు. తరువాత మృతదేహాన్ని ఎవరికీ అనుమానం రాకుండా కనిపించకుండా చేయాలనీ 'రెక్కీ' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'లేడీ డాన్' ఆదేశాల మేరకు సత్యం యజమాని, ఇంకా కొందరు కలిసి మృతదేహాన్ని ఈనెల 1వ తేదీ సాయంత్రం లేదా రెండో తేదీన ఉదయం సమయంలోనో బుగ్గలేటిపల్లె సమీపంలోని వంకలోకి తీసుకెళ్లారు. తాము అనుకున్న ప్రకారం శ్రీకాంత్ రెడ్డి మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టారు. తరువాత తమంతట తాము పరారయ్యారు. ఇదే సమయంలో శ్రీకాంత్ రెడ్డి సెల్‌ఫోన్‌ను నిందితులు తమ వెంట తీసుకుని వెళ్లారు. తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో అతని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈనెల 2న సాయంత్రం పోలీసులు చింతకొమ్మదిన్నె పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడని, పచ్చబొట్టు ఆధారంగా శ్రీకాంత్‌రెడ్డిని గుర్తించారు. రిమ్స్ వైద్యులతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి సోదరుడు శ్రీమంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కడప రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డిలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనలో ఆరుగురి పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అందరిపై నిఘా ఉంచారని, నేడో, రేపో మీడియా ముందు నిందితులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.

వ్యక్తిపై దాడి : పోలీసులకు ఫిర్యాదు

కమలాపురం : మండల పరిధిలోని జంగంపల్లెకు చెందిన జనార్ధన్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన నిత్యానందరెడ్డి దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం జనార్ధన్‌రెడ్డి జంగంపల్లె నుంచి కమలాపురానికి వస్తుండగా మార్గ మధ్యలో నిత్యా నందరెడ్డి కారం పొడి చల్లి దాడి చేశాడు. ఈ దాడిలో జనార్ధన్ రెడ్డి కాలు, చేతికి గాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సాయినాథ శర్మకు అనుచరుడు. విషయం తెలుసుకున్న శర్మ స్థానిక క్రాస్ రోడ్డు పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా నిత్యానందరెడ్డికి చెందిన పురుగు మందుల దుకాణానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఫైర్ అధికారులు సకాలంలో వచ్చి మంటలను అదుపు చేశారు. జంగంపల్లె గ్రామంలో తిరిగి ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్థాపంతో భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కనసానివారిపల్లె పంచాయతీ, బాలిరెడ్డిగారిపల్లె మూలపెంటకు చెందిన లోకేష్(28) ఐటీఐ చదివాడు. లక్ష్మి వారం రోజుల క్రితం భర్తతో ఏర్పడిన విభేదాల కారణంగా అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి రావాల్సిందిగా పెద్దమనుషుల పంచాయితీ నిర్వహించారు. అయినా భార్య తిరిగి రాకపోవడంతో మనస్థాపం చెందిన లోకేష్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు. సమాచారాన్ని ఔట్ పోస్టు సిబ్బంది తంబళ్లపల్లె పోలీసులకు తెలిపారు.

కారు, ట్రాక్టర్ ఢీ

– ఒకరికి గాయాలు


దెబ్బతిన్న వాహనాలు

కలకడ : కారు–ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్ఐ సీటీ స్వామి కథనం మేరకు శనివారం మండలంలోని రాతిగుంటపల్లె పంచాయతీ కోన క్రాస్‌వద్ద కె.దొడ్డిపల్లె గ్రామానికి చెందిన చరపల్లె వెంకటనాగబూషణరావు కారులో మదనపల్లె నుంచి కలకడ వైపు వస్తుండగా పాపిరెడ్డిగారిపల్లె క్రాస్ వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈప్రమాదంలో చరపల్లె వెంకటనాగబేషణరావుకు తీవ్రగాయాలయ్యాయి. . క్షతగాత్రున్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు

వీరబల్లె (రాయచోటిటౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిలో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వైర్లు కాలిపోయి మంటలు చెలరేగాయి. దీంతో ఆ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ప్రింటర్లు కాలి బూడిదయ్యాయి. విషయం తెలియగానే రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామి రెడ్డి పశుసంవర్ధక శాఖ కార్యాయానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అప్పటికే కార్యాలయంలోని సుమారు రూ.80 వేల విలువైన వస్తువులు కాలిపోయాయి.

తప్పిన ప్రమాదం


చెట్టును ఢీకొన్న కారు

నంబేపల్లె : మండల పరిధిలోని ఎర్రగుంట్ల బస్టాప్ సమీపంలో ఉన్న చెట్టును శనివారం కారు ఢీకొంది. స్థానికుల కథనం మేరకు హైదరాబాద్ నుంచి తిరువళ్లూరుకు వెళుతున్న కారు ఎర్రగుంట్ల బస్టాపు సమీపంలోకి రాగానే ఆదుపుతప్పి జాతీయ రహదారిపై పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. కారుకు ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

పాముకాటుతో చిన్నారికి అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో రెండేళ్ల చిన్నారి తీవ్ర అస్వస్థత పాలైన సంఘటన శనివారం పీటీఎం మండలంలో జరిగింది. మద్దయ్యగారిపల్లె పంచాయతీ దొరగుండ్లపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి భువనేశ్వరిల తనయుడు బుల్లెట్ రెడ్డి(2) శనివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. చిన్నారి తీవ్ర అస్వసత్థ గురి కావడంతో కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాలుడు కోలుకుంటున్నాడు.

ప్రాథమిక పాఠశాలలో చోరీ


బీరువాను పరిశీలిస్తున్న ఎంఈఓ శంకరయ్య, హెచ్ఎం వెంకటసుబ్బయ్య

సిద్దవటం : మండల కేంద్రమైన దిగువపేటలోని బేల్దారి వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాను సిద్దవటం ఎంఆర్‌సీ నుంచి శుక్రవారం సాయంత్రం నూతన పాఠ్య పుస్తకాలను తీసుకొని పాఠశాలలో పెట్టేందుకు వెళ్లగా అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల గదికి ఉన్న తాళాన్ని పగులగొట్టి ఉంది.లోపలికి వెళ్లి చూడగా వస్తువులను చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. నిందితులు పాఠశాల ప్రహరీ గోడ వద్ద చెక్కను అమర్చుకొని లోపలికి వెళ్లారన్నారు చోరీ జరిగిన విషయాన్ని సంబంధిత ఎంఈఓ శంకరయ్యకు తెలియజేశారు. శనివారం ఉదయం ఆయన చోరీ గురించి ఆరా తీశారు. బీరువాలో నుంచి చిందర వందరగా ఉన్న వస్తువులను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ సిద్దవటం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జల్ జీవన్ మిషన్ పనుల పరిశీలన

లక్కిరెడ్డిపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్ పనులను శనివారం కేంద్ర బృందం పరిశీలించింది. బృందంలో రానా ఆర్‌కే సింగ్, నవనీత్ కిషోర్ లక్కిరెడ్డిపల్లెలో రూ. 30 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. అనంతరం జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా నీరు అందించాలని ఆయన సూచించారు. చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో జల్ జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని, పనులలో నాణ్యత లేకపోతే ఉపేక్షించేది లేదన్నారు. పెద్ద ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, అందులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 15 రోజులకు ఒకసారి నీటిలో ఫ్లోరైడ్ ఇతర విషయాలను పరిశీలించాలని, ప్రజలకు మంచినీటిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, క్వాలిటీ కంట్రోల్ డిఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ కిషోర్ కుమార్, సయ్యద్ అమీర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.